స్వయం ఉపాధి యూనిట్లు ప్రారంభించాలి: కలెక్టర్

పార్వతీపురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్వయం ఉపాధి యూనిట్లను ప్రారంభించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. గురువారం తన కార్యాలయంలో నిర్వహించిన జిల్లాస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా అభివృద్ధికి బ్యాంకులు ముఖ్యభూమిక పోషించాలన్నారు. అందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు సహకరించాలన్నారు. సామాజిక కార్యక్రమాల్లో బ్యాంకులు పెద్ద ఎత్తున భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ దినేష్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే మార్గదర్శకులు

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్
- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



ఉత్తమ ఉపాధ్యాయుడ్ని సన్మానిస్తున్న దృశ్యం

పార్వతీపురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో గురువులు కీలకపాత్ర పోషించి మార్గదర్శకులుగా నిలుస్తున్నారని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రం పార్వతీపురంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గురువులకు విశిష్ట గుర్తింపు తెచ్చిన మహనీయుడు సర్వేపల్లి రాధాకృష్ణన్ అని అన్నారు. ఉపాధ్యాయ వృత్తి విలువైనదని తెలిపారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు నాణ్యమైన పౌష్టికాహారం అందించే బాధ్యత అందరిపై ఉందని అన్నారు. కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రపంచానికి పరిచయం చేస్తే, వారిని ఉన్నతంగా తీర్చిదిద్దే బాధ్యతను మాత్రం ఉపాధ్యాయులు తీసుకుంటున్నారని కొనియాడారు. డీపీఆర్వో లోచర్ల రమేష్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు తమ వృత్తిని ఎంతో పవిత్రంగా భావించి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. లయన్స్ క్లబ్‌లో ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన క్రాఫ్ట్ సైన్స్ ఫొటో ఎగ్జిబిషన్‌ను కలెక్టర్ పరిశీలించారు. ముందుగా సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీ, జిల్లా విద్యాశాఖ అధికారిణి పగడాలమ్మ, సహాయ సంచాలకులు జ్యోతి, సుధాకరరావు, జిల్లా సమన్వయ అధికారి సుధాకర్, ఎంఈవోల రాష్ట్ర సంఘం అధ్యక్షుడు సామల సింహాచలం, ప్రోగ్రాం అధికారి శంకరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సర్వేపల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, తదితరులు



పెద్దగెడ్డ జలాశయం ద్వారా విడుదల చేసిన నీరు

మళ్లీ అల్పపీడనం

- నేటి నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక
- యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన కలెక్టర్
- ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశం
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

పార్వతీపురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే తుఫాన్ కారణంగా జిల్లాలోని పలు మండలాల్లో భారీ వర్షాలు కురిసి నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే. ఇప్పుడు బంగాళాఖాతంలో మళ్లీ అల్పపీడనం ఏర్పడిందని, దీని ప్రభావంతో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణం శాఖ హెచ్చరించింది. దీంతో కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారులు, సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, సీహెచ్‌డబ్ల్యుల తో సహా ఎవరూ తమ ప్రధాన కేంద్రాలను విడిచి వెళ్లరాదని స్పష్టం చేశారు. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. విపత్తులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న భవనాలు, ఇళ్లల్లో ఉన్న వారిని సురక్షిత ప్రదేశాలకు తరలించాలన్నారు. పంచాయతీరాజ్, ఇరిగేషన్ సిబ్బంది చెరువులు, ఆనకట్టలు తనిఖీలు చేయాలన్నారు. బ్లీచింగ్, క్లోరినేషన్ నిల్వలు సిద్ధంగా ఉంచాలన్నారు. వరదల సమయంలో ప్రజలు పాములు, తేళ్లు కాట్లకు గురయ్యే ప్రమాదం ఉందని చెప్పారు. అలాగే, వ్యాధులు ప్రబలడానికి అవకాశం ఉందని, వాటి చికిత్సకు కావాల్సిన మందులు సిద్ధం చేసుకోవాలని ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ (08963-293046)ను సంప్రదించాలని సూచించారు.

రైతుల్లో ఆందోళన..

అల్పపీడనం కారణంగా మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు జిల్లాలో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పాచిపెంట మండలం కుంటికపెంట ఏకలవ్య పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు గెడ్డ ప్రవాహానికి కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయారు. అలాగే, పార్వతీపురం మండలం పుట్టూరు, తదితర గ్రామాల్లో వరి నారు మడులు ముంపునకు గురయ్యాయి. చెరువులు ప్రమాదకర స్థితికి చేరుకున్నాయి. ఇప్పుడు మళ్లీ అల్పపీడనంతో వర్షాలు కురిస్తే చెరువులకు గండ్లు పడతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. వాగులు, గెడ్డలు ఉప్పొంగితే తమ పంటలు పూర్తిగా ముంపునకు గురవుతాయని, వరినాట్లు కొట్టుకుపోతాయని చెబుతున్నారు. అలాగే, నదీతీర, లోతట్టు ప్రాంతాల వాసులు కూడా భయాందోళన చెందుతున్నారు. అధికంగా వర్షాలు కురిస్తే.. తమ పరిస్థితేమిటోనని టెన్షన్ పడుతున్నారు.

నిలకడగా నాగావళి..

గరుగుబిల్లి: తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదిలో గురువారం వరద ప్రవాహం నిలకడగా ఉంది. గత రెండు రోజులుగా పైనుంచి 2 వేల క్యూసెక్కులకు పైగా వరద వచ్చి నదిలో చేరింది. ప్రస్తుతం నదిలోకి పైనుంచి 1,750 క్యూసెక్కుల నీరు వస్తుంది. సాగునీటి అవసరాలకు ప్రధాన కాలువల నుంచి 1,400 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు. స్పిల్‌వే గేట్ల నుంచి 500 క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 105 మీటర్లకు గాను 104.05 మీటర్ల నీరు ఉంది. జిల్లాలో శుక్రవారం నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణశాఖ హెచ్చరికలతో సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నట్లు ప్రాజెక్టు డీఈ టి.రఘునాథనాయుడు, జేఈలు కె.శ్రీనివాసరావు, బి.కిషోర్‌కుమార్ తెలిపారు. వరద ప్రవాహం అధికంగా వస్తే స్పిల్‌వే గేట్ల నుంచి దిగువకు మళ్లించేందుకు ఆపరేటర్ కెంగువ రామకృష్ణకు పలు సూచనలు చేశారు.

పాచిపెంట మండలంలోని పాఠశాలలకు సెలవు

పార్వతీపురం(ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో పాచిపెంట మండలంలోని అన్ని పాఠశాలలకు సెలవును ప్రకటిస్తూ ఆర్డీవో హేమలత గురువారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. తహసీల్దార్, మండల విద్యాశాఖ అధికారి సూచనల మేరకు సెలవును ప్రకటించినట్లు చెప్పారు. ఈ మండలంలో గెడ్డలు, వాగులు దాటి పాఠశాలలకు వెళ్లవలసిన పరిస్థితి ఉండడంతో అధికార యంత్రాంగం ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటుంది.

పెద్దగెడ్డ నీరు విడుదల..

పాచిపెంట: జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికలతో పెద్దగెడ్డ జలాశయం ద్వారా గురువారం సాయంత్రం నీటిని విడుదల చేశారు. మధ్యాహ్నం కురిసిన వర్షానికి జలాశయంలో నీటి మట్టం పెరిగింది. దీంతో అధికారుల ఆదేశాల మేరకు నీరు విడుదల చేశారు. జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 213.8 మీటర్లు కాగా, ప్రస్తుతం దానికి మించిపోవడంతో స్పిల్‌వే ద్వారా 320 క్యూసెక్కులు, కుడి కాలువ ద్వారా 80 క్యూసెక్కులు నీరు విడుదల చేశారు.

ఎక్కడినుంచైనా పింఛన్

- తీసుకునేలా ప్రభుత్వం వెసులుబాటు
- పింఛన్‌దారుల కోసం అందుబాటులోకి కొత్త ఆప్షన్
- సచివాలయంలోనే దరఖాస్తు

(పార్వతీపురం-ఆంధ్రజ్యోతి)



సామాజిక పింఛన్ లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా పింఛన్ తీసుకునేందుకు వెసులుబాటు కల్పించింది. కొత్త ఆప్షన్‌ను అందుబాటులోకి తెచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పింఛన్ బదిలీకి అవకాశమిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. నేడు ఆచరణలో పెట్టారు. ఇకపై లబ్ధిదారులు రాష్ట్రంలో ఎక్కడ అందుబాటులో ఉంటే అక్కడ పింఛన్ తీసుకోవచ్చు. పింఛన్ బదిలీ చేయాలనుకుంటున్న వారు ఎక్కడ పింఛన్ తీసుకుంటున్నారో ఆ సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేయడం ద్వారా తాత్కాలికంగా బదిలీ చేసుకోవచ్చు. దరఖాస్తులో పింఛన్ ఐడీ, ఏ ప్రాంతంలో తీసుకోవాలని అనుకుంటున్నారో ఆ జిల్లా, మండలం, ప్రాంతం పేరు పేర్కొనాలి. ఆధార్ జిరాక్స్ ఇవ్వాలి. సామాజిక పింఛన్ వెబ్‌సైట్‌లో ప్రస్తుతం ఆ ఆప్షన్ ఓపెన్ అయ్యింది. స్వగ్రామాలకు రాలేనటువంటి వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ఆప్షన్ ప్రతినెలా అందుబాటులో ఉంటుందని అధికారులు చెబుతున్నారు. చాలా మంది లబ్ధిదారులు వివిధ కారణాలతో గ్రామాలకు దూరంగా ఉంటున్నారు. పింఛన్ అందుకోవడానికి వ్యయప్రయాసలు పడుతున్నారు. అటువంటి వారి కోసం ప్రభుత్వం పింఛన్ తాత్కాలిక బదిలీకి వెసులుబాటు ఇచ్చింది.

జిల్లాలో వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, డప్పు కళాకారులు, దీర్ఘకాలిక రోగులు తదితర 14 విభాగాలకు చెందిన 1,42,866 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. వీరికి రూ.59.37 కోట్లు ప్రతినెలా పంపిణీ చేస్తున్నారు. వీరిలో చాలా మంది లబ్ధిదారులు అవసరాలను బట్టి వివిధ ప్రాంతాలకు ప్రయాణించేవారు, ఉపాధి కోసం ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న వారు, తీర్థయాత్రలు తదితర పనులపై సుదూర ప్రాంతాలకు వెళ్లేవారు ఉన్నారు. అయితే పింఛన్ తొలిరోజే అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. బయట ప్రాంతాల్లో ఉండే వారు రెండు రోజుల తరువాత వచ్చి తీసుకుంటున్నారు. దీనివల్ల నిర్దేశించిన సమయంలో శతశాతం పింఛన్లు అందించలేకపోతున్నారు. మరోవైపు గతం మాదిరిగా వలంటీర్లు లేరు. సచివాలయ సిబ్బందితో పాటు ప్రభుత్వ శాఖల సిబ్బంది పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. తొలిరోజు పంపిణీ పూర్తిచేస్తే వారు తమ సొంత శాఖలపై దృష్టిపెట్టవచ్చు. లబ్ధిదారులకు వ్యయప్రయాసలు తగ్గించడం, సిబ్బందికి పనిభారం తగ్గించడం కోసమే ప్రభుత్వం పింఛన్ల బదిలీకి మొగ్గుచూపినట్టు సమాచారం.

ఆది నుంచి సానుకూల నిర్ణయాలు..

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పింఛన్ల మొత్తం పెరిగింది. రూ.3 వేలు ఉన్న పింఛన్‌ను రూ.4 వేలకు పెంచుతానని చంద్రబాబు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేశారు. గత రెండు నెలలుగా వలంటీర్లు లేకుండానే సచివాలయ ఉద్యోగులు, ప్రభుత్వం సిబ్బంది ఇంటింటా పింఛన్ల పంపిణీని పూర్తిచేశారు. వలంటీర్లు లేకుండా పింఛన్లు ఎలా అందిస్తారోనని వైసీపీ ఎద్దేవా చేసింది. కానీ కూటమి ప్రభుత్వం విజయవంతంగా పింఛన్ల పంపిణీని పూర్తిచేసింది. సెప్టెంబరు నెలకు సంబంధించి ఒకరోజు ముందుగానే అంటే ఆగస్టు 31న అందించింది. సెప్టెంబరు 1 ఆదివారం కావడంతో ఆ నిర్ణయం తీసుకుంది. తొలిరోజే 94 శాతానికిపైగా పింఛన్లు అందించి రికార్డు సృష్టించారు. ఇప్పుడు దూర ప్రాంతంలో ఉన్న లబ్ధిదారుల కోసం తాత్కాలిక బదిలీ వెసులుబాటు కల్పించింది.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గిరిజన రైతులు

సాగు భూములకు పట్టాలు ఇవ్వాలి

- కుడుమూరు గిరిజన రైతుల ధర్నా

పాచిపెంట, సెప్టెంబరు 5: దశాబ్దాలుగా తాము సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని మండలంలోని కుడుమూరు గ్రామ గిరిజన రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుడుమూరులో సర్వే నెంబరు 48లోని 782 ఎకరాల ప్రభుత్వ భూములను దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్నామని తెలిపారు. సాగు పట్టాల కోసం పలుమార్లు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భూ పోరాటాలు చేసిన మేరకు సర్వే నిర్వహించారని, కానీ పట్టాలు మాత్రం మంజూరు చేయలేదని వాపోయారు. ఈ భూములపై పెద్దల కన్ను పడిందని, వారి ఆటలు సాగనీయకుండా అడ్డుకున్నామని ఆదివాసీ గిరిజన సంఘం భూపోరాట నాయకులు సూకురు అప్పలస్వామి, జన్ని లక్ష్మణ తెలిపారు. కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నామని గిరిజన రైతులు తెలిపారు. అనంతరం తహసీల్దార్ డి.రవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు, గిరిజన రైతులు పాల్గొన్నారు.

జిల్లాలో గిరి వైద్య కేంద్రాలు



కారాడవలస గిరిజన గ్రామం

- కంటైనర్ క్లినిక్‌ల ఏర్పాటుకు శ్రీకారం
- ఐదు చోట్ల పెట్టేందుకు చర్యలు
- తొలుత కారాడవలసలో ప్రారంభంకానున్న సేవలు

(పార్వతీపురం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని కొండ శిఖర గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ వైద్యం అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం గిరి వైద్య కేంద్రాల పేరిట కంటైనర్ క్లినిక్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఐదు చోట్ల ఈ క్లినిక్‌లను ఏర్పాటు చేయనుంది. తొలుత సాలూరు మండలం తోనాం పీహెచ్‌సీ పరిధిలోని కారాడవలస గ్రామంలో కంటైనర్ క్లినిక్ సేవలను ప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే ట్రాలీ లారీలో కంటైనర్‌ను కారాడవలసకు తీసుకువచ్చారు. దీన్ని ఏర్పాటు చేసే ప్రాంతాన్ని ఎక్స్‌కవేటర్‌తో చదును చేయించారు. అనంతరం కంటైనర్‌ను కిందకు దించారు. ఈ కంటైనర్‌లో రోగుల కోసం నాలుగు బెడ్లు ఏర్పాటు చేయనున్నారు. డాక్టర్‌తో పాటు వైద్య సిబ్బంది ఉంటారు. ఓపీ సేవలు కూడా అందించనున్నారు. అందులో ఒక టీవీని కూడా ఏర్పాటు చేయనున్నారు. రోగులతో వచ్చే సహాయకుల కోసం ప్రత్యేక వెయిటింగ్ రూమ్ కూడా ఉండనుంది. కంటైనర్ ప్రాంగణంలో అంగన్వాడీ కేంద్రంతో పాటు మహిళా సంఘాల సమావేశాలు నిర్వహించుకొనేందుకు అవసరమైన సల్థం ఉంటుంది. దీనిని కూడా ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ఉపయోగించుకోవచ్చు.



ట్రాలీపై కంటైనర్‌ను తెస్తున్న దృశ్యం



గ్రామంలో కంటైనర్‌ను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

కలెక్టర్ ఆలోచనతోనే..

జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్యామ్‌ప్రసాద్ గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టిసారించారు. రహదారులు లేక సకాలంలో కొండ శిఖర గ్రామాల నుంచి గిరిజనులు వైద్యం కోసం మైదాన ప్రాంతాలకు రాలేక ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించారు. ముఖ్యంగా గర్భిణులను ప్రసవాల సమయంలో డోలీ ద్వారా కిందకు దించుతున్నట్లు గుర్తించారు. ఈ పరిస్థితి లేకుండా కొన్ని గ్రామాలను యూనిట్‌గా తీసుకొని, ఆ గ్రామాలకు కేం ద్రంగా ఏదో ఒక గ్రామం వద్ద, ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండే విధంగా గిరి వైద్య కేంద్రాలను ఏర్పాటు చేయాలనే ఆలోచనతో కలెక్టర్ ముందుకెళ్లారు. ఇందులో భాగంగా సీతంపేట ఐటీడీఏ పరిధిలోని కొండ శిఖర ప్రాంతాల్లో ఐదు కంటైనర్ క్లినిక్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. ముందుగా సాలూరు మండలం తోనాం పీహెచ్‌సీ పరిధిలో ఉన్న కారాడవలస గ్రామంలో గిరి వైద్య కేంద్రాన్ని ప్రారంభించేందుకు ముమ్మర చర్యలు చేపడుతున్నారు. కారాడవలసతో పాటు సమీప గిరిజన గ్రామాల ప్రజలకు ఈ కంటైనర్ క్లినిక్ ఎంతగానో ఉపయోగపడనుంది.

రాష్ట్రంలోనే ప్రథమంగా..

కంటైనర్ క్లినిక్‌లను రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా పార్వతీపురం మన్యం జిల్లాలో ఏర్పాటు చేస్తున్నారు. గతంలో ఎప్పుడూ కూడా ఇటువంటి ఆలోచన ఏ ప్రభుత్వాలకు గాని, అధికారులకు గాని రాలేదు. కానీ, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆలోచనతో కూటమి ప్రభుత్వం కంటైనర్ క్లినిక్‌ల ద్వారా గిరిపుత్రులకు వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటుంది. దీంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పదిహేనేళ్ల ప్రయాణం

అక్కినేని నాగచైతన్య తెలుగు చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టి పదిహేనేళ్లు అయింది. ఆయన నటించిన తొలి చిత్రం 'జోష్' 2009 సెప్టెంబర్ 5న విడుదలైంది. ఈ పదిహేనేళ్ల ప్రయాణంలో విలక్షణమైన పాత్రలు ఎన్నో పోషించి, మంచి నటుడిగా ఆయన పేరు తెచ్చుకున్నారు. ప్రస్తుతం నాగచైతన్య 'తండేల్' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ ఆ చిత్ర యూనిట్ ప్రత్యేకమైన పోస్టర్ విడుదల చేసింది. సముద్రం దగ్గర ఫిషింగ్ బోట్ మీద నిల్చుని చిరునవ్వు చిందిస్తున్న చైతు లుక్ ఆకట్టుకుంది. అల్లు అరవింద్ సమర్పణలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి చందు మొండేటి దర్శకుడు. బన్నీ వాస్ నిర్మాత.

ఎలాంటి సాయం కావాలన్నా చేస్తాం

డి.సురేశ్‌బాబు



తెలుగు రాష్ట్రాల్లో వరద ముప్పు బారిన పడిన బాధితుల కోసం ఇప్పటికే తెలుగు సినీ ప్రముఖులు రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సహాయ నిధికి భారీ మొత్తంలో విరాళాలు ప్రకటించిన సంగతి తెలిసిందే. వరద బారిన పడిన కుటుంబాలను ఆదుకోవడానికి తెలుగు చలన చిత్రసీమ ప్రముఖులు గురువారం ఓ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిల్మ్ చాంబర్ గౌరవ కార్యదర్శి దామోదర ప్రసాద్ మాట్లాడుతూ "ఫిల్మ్ చాంబర్ తరపున రూ.25 లక్షలు.. నిర్మాతల తరపున రూ.10 లక్షలు.. ఫెడరేషన్ తరపున రూ.5 లక్షలు రెండు తెలుగు రాష్ట్రాలకు విరాళంగా ఇస్తున్నాం" అని చెప్పారు. "మా దగ్గుబాటి కుటుంబం తరపున బాధితుల కోసం రూ.కోటి విరాళం అందజేస్తున్నాం. కేవలం డబ్బులే కాకుండా.. నిత్యావసరాలను కూడా పంపిణీ చేస్తాం. బాధితులకు ఎలాంటి సాయం కావాలన్నా చేసేందుకు సిద్ధంగా ఉన్నాం" అని డి. సురేశ్‌బాబు అన్నారు. "మేమంతా ఈ స్థాయిలో ఉండటానికి కారణం.. మమ్మల్ని ఆదరించిన ప్రజలే. వరద బారిన పడిన వారందరినీ తప్పకుండా ఆదుకుంటాం" అని దర్శకుడు కె.రాఘవేంద్ర రావు తెలిపారు. "మా నిర్మాణ సంస్థ తరపున తెలంగాణకు రూ.25 లక్షలు.. ఆంధ్రప్రదేశ్‌కు రూ.25లక్షలు ప్రకటిస్తున్నాను. ఇండస్ట్రీలోని వారంతా ఈ సమయంలో ముందుకు వచ్చి విరాళాలు అందించాలి" అని నిర్మాత దిల్ రాజు కోరారు. ఈ కార్యక్రమంలో తమ్మారెడ్డి భరద్వాజ, ప్రసన్నకుమార్, జెమినీ కిరణ్, అశోక్ కుమార్, అనిల్ అమ్మిరాజు, భరత్ చౌదరి పాల్గొన్నారు.

దగ్గుబాటి కుటుంబం	రూ.కోటి
దిల్ రాజు	రూ.50 లక్షలు
ఫిల్మ్ చాంబర్	రూ.50 లక్షలు
నిర్మాతల మండలి	రూ.20 లక్షలు
ఫిల్మ్ ఫెడరేషన్	రూ.10 లక్షలు

32వ సినిమా విడుదలకు ముహూర్తం



విభిన్న కథాంశాలు ఎన్నుకొని వరుస హిట్స్‌తో దూసుకుపోతున్న నాని తన 32వ చిత్రం వివరాలు గురువారం ప్రకటించారు. 'హిట్ 3' చిత్రంలో తన లుక్‌ని, గ్లింప్స్‌ను విడుదల చేశారు. డాక్టర్ శైలేష్ కొలను ఈ సినిమాకు దర్శకుడు. ప్రశాంతి తిపిర్నేని నిర్మాత. సిగార్ తాగుతూ, కారు నడుపుతూ రక్తపు చేతులు, గొడ్డలితో ఫెరోషియస్‌గా కనిపించారు నాని. 'హిట్ 3'లో ఆయన అర్జున్ సర్కార్‌గా కనిపించబోతున్నారు. ఈ పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుందని దర్శకుడు చెప్పారు. 2025 వేసవి సందర్భంగా మే ఒకటిన సినిమాను విడుదల చేస్తామని నిర్మాత చెప్పారు. 'హిట్ 3' చిత్రానికి సాను జాన్ వర్గీస్ ఛాయాగ్రహణాన్ని, మిక్కీ జే మేయర్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు.

వినోదాన్ని పంచే సినిమా



ఫరియా అబ్దుల్లా నటించిన తాజా చిత్రం 'మత్తు వదలరా 2'. ఇది 2019 విడుదలై సూపర్ హిట్ అయిన 'మత్తు వదలరా' సినిమాకు సీక్వెల్. ఈ నెల 13న విడుదలవుతున్న సందర్భంగా ఫరియా మీడియాతో ముచ్చటించారు.

"ఈ సినిమా ఒక డిఫరెంట్ థ్రిల్లర్. ఎన్నో ట్విస్టులు, సర్‌ప్రైజ్‌లతో కూడిన కథ ఇది. ఇందులో పాత్రధారుల కష్టాల నుంచే కామెడీ పుడుతుంది. ఈ సినిమాలో సన్నిధి అనే స్పెషల్ ఏజెంట్ పాత్రలో కనిపిస్తాను. నాది యాక్షన్‌తో నిండిన పాత్ర. దర్శకుడు రితేష్ రాణాకు ఫిల్మ్ మేకింగ్‌లో చాలా అవగాహన ఉంది. ప్రతీ విషయంలో క్లారిటీగా ఉంటారు. కాలభైరవ ఇచ్చిన సంగీతం సినిమాకు అదనపు ఆకర్షణ. ఈ సినిమా మొదటి భాగం కంటే మరింత వినోదాన్ని పంచుతుంది. ప్రస్తుతం తిరువీర్‌తో ఓ ప్రేమకథలో నటిస్తున్నా. త్వరలోనే ఓ తమిళ చిత్రం కూడా మొదలవ్వబోతోంది" అని ఫరియా చెప్పారు.



మహిళల భద్రతకు కమిషన్ ఏర్పాటు చేయండి

మంచు విష్ణు



తెలుగు చిత్ర పరిశ్రమలో మహిళల రక్షణ, భద్రత మెరుగుపరచడం కోసం ఇండస్ట్రీలోని మహిళలే ప్రాతినిధ్యం వహించేలా ఒక కమిషన్ వేయాలని 'మా' (మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) అధ్యక్షుడు మంచు విష్ణు తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆయన ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి సోషల్ మీడియా ద్వారా విజ్ఞప్తి చేశారు.

హేమ కమిటీ నివేదికపై ప్రత్యేక ధర్మాసనం

జస్టిస్ హేమ కమిటీ నివేదిక నేపథ్యంలో నమోదైన కేసులపై విచారణ జరిపేందుకు ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన ప్రత్యేక ధర్మాసనాన్ని కేరళ హైకోర్టు ఏర్పాటు చేయనుంది. హేమ కమిటీ రిపోర్ట్‌ను బహిర్గతం చేయడానికి అనుమతిస్తూ ఏకసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై గురువారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ ముస్తాఖ్, జస్టిస్ ఎస్. మను మదేతో కూడిన ధర్మాసనం మహిళా న్యాయమూర్తులతో కూడిన ప్రత్యేక ధర్మాసనం ఏర్పాటుపై మౌఖిక ఆదేశాలు ఇచ్చింది.

సంస్కృత టీచర్స్‌కు అంకితం



రచయిత, దర్శకుడు జనార్థన మహర్షి 'శ్లోక' పేరుతో ఓ సంస్కృత చిత్రాన్ని రూపొందిస్తున్నారు. రాగిణీ ద్వివేది ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రాన్ని జనార్థన మహర్షి కుమార్తెలు శ్రావణి, శర్వాణి నిర్మాతలు. ఈ సినిమా గురించి జనార్థన మహర్షి వివరిస్తూ 'సినిమాలోని కీలకమైన రుద్రభూమి సన్నివేశాలను బెంగళూరు, మైసూర్‌లో చిత్రీకరించాం. దేశంలోని పురాతనమైన అనేక శ్మశానాలలో షూటింగ్ చేశాం. సంస్కృతంలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాను అనేక భారతీయ భాషల్లోకి అనువదిస్తాం. గురువారం ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా మా చిత్రాన్ని సంస్కృత టీచర్స్‌కు అంకితం ఇస్తున్నాం' అని చెప్పారు. ఈ సినిమాలో తనికెళ్ల భరణి కీలక పాత్ర పోషిస్తున్నారు.

ఇన్ ప్రోగ్రెస్

రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



యువతరానికి నచ్చే అంశాలు, కుటుంబ భావోద్వేగాల మేళవింపుతో రూపొందిన రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'రోటీ కపడా రొమాన్స్' అక్టోబరు 4న విడుదల కానుంది. హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువ్వేక్ష, మేఘలేఖ, కుష్బూ చౌదరి హీరో హీరోయిన్లుగా నటించారు. విక్రమ్‌రెడ్డి దర్శకుడు. బెక్కెం వేణుగోపాల్, సృజన్‌కుమార్ బొజ్జం నిర్మాతలు. సినిమాలో ప్రతి పాత్ర యూత్‌కు కనెక్ట్ అవుతుందనీ, రొమాన్స్, ఎంటర్‌టైన్‌మెంట్, ఎమోషన్స్ ప్రధాన బలాలు అని దర్శకుడు తెలిపారు. కొత్త పాయింట్‌తో రూపుదిద్దుకున్న ఈ చిత్రం తప్పకుండా విజయం సాధిస్తుందనీ, అది ఈ రేంజ్ అనేది ప్రేక్షకులు నిర్ణయిస్తారనీ నిర్మాతలు చెప్పారు.


స్పీడ్‌గా..



గణేశ్, హేమంత్, ప్రీతీ సుందర్, జాహ్నవి నటించిన 'స్పీడ్ 220' చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో హీరోలిద్దరూ పోటీ పడి నటించారనీ, ఫ్యామిలీ ఆడియన్స్‌ను కూడా అలరించే విధంగా సినిమా ఉంటుందని దర్శకుడు హర్ష బేజాగం తెలిపారు. కె.ఫణి, ఎం.సూర్యనారాయణ, ఎం.దుర్గారావు ఈ సినిమాను నిర్మించారు.









వరద బాధితులకు జిల్లా నుంచి నిత్యావసరాలు

● 5.50 టన్నులు పంపించిన జిల్లా యంత్రాంగం ● వాహనాన్ని ప్రారంభించిన కలెక్టర్ అంబేడ్కర్

కలెక్టరేట్: జిల్లా నుంచి విజయవాడ వరద బాధితులకు రెండో రోజు కూరగాయలు, నిత్యవసరాలను గురువారం తరలించారు. కలెక్టరు అంబేడ్కర్ సూచనలతో వరద బాధితుల సహాయార్థం 5.50 టన్నుల కూరగాయలను, వాటర్ బాటిళ్లు, బిస్కెట్లు తదితర నిత్యాసర సరుకులను మార్కెటింగ్ శాఖ పంపించింది. కలెక్టరు కార్యాలయం నుంచి విజయవాడకు కూరగాయలు, నిత్యావసరాలతో వెళ్తున్న వాహనాన్ని కలెక్టర్ ప్రారంభించారు. దొండ, బంగాళాదుంపలు, క్యాబేజీ, వంకాయలు, ఉల్లి, అరటి, పచ్చిమిర్చి, తదితర కూరగాయలు, జిల్లాలోని రైతు బజారులను హోల్ సేల్ డీలర్ల వద్ద ఉద్యానశాఖతో కలిసి సేకరించి పంపిస్తున్నట్లు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఏడీ రవికిరణ్ తెలిపారు. వీటితోపాటు 150 కేసులు వాటర్ బాటిళ్లు, 15 బాక్సుల బిస్కెట్లు పంపించామన్నారు. వీటిని విజయవాడలో వరద బాధితులకు ఏర్పాటు చేసిన మొబైల్ రైతు బజారుల ద్వారా పంపిణీ చేస్తారని తెలిపారు.



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టరు అంబేడ్కర్

యువత నైపుణ్యాలపై స్కిల్ సర్వే చేపట్టాలి

జిల్లాలోని వివిధ రకాల నైపుణ్యాలు కలిగిన యువత ఏ మండలంలో ఎంతమంది అందుబాటులో ఉన్నారనే అంశంపై సమాచారాన్ని సేకరించేందుకు జిల్లా వ్యాప్తంగా స్కిల్ సర్వే నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సర్వేలో లభ్యమైన సమాచారం ఆధారంగానే జిల్లాలో తదుపరి జాబ్ మేళాలు ఆయా నియోజకవర్గాల్లో నిర్వహించాలన్నారు. గురువారం తన చాంబర్‌లో జాబ్ క్యాలెండర్ అమలుపై వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయ సమావేశం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలపై సామాజిక మాధ్యమాల, పత్రికా, ప్రసార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ మేనేజరు ఎస్. గోవిందరావు, డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి, జాబ్ మేనేజరు మార్టిన్, జిల్లా ఉపాధి కల్పన అధికారి అరుణకుమారి తదితరులు ఉన్నారు.

మట్టి గణపతినే పూజించాలి

వినాయకచవితి రోజున మట్టి గణపతి ప్రతిమనే పూజించాలని కలెక్టరు అంబేడ్కర్ కోరారు. మట్టి గణపతి విగ్రహాల ఆవశ్యకతను వివరిస్తూ జిల్లా కాలుష్య నియంత్రణ శాఖ రూపొందించిన పోస్టర్‌ను కలెక్టరు చాంబర్‌లో గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలోని జిల్లా కాలుష్య నియంత్రణ ఇంజనీర్ సరిత ఉన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం

ఎస్పీ వకుల్ జిందాల్

బొబ్బిలి/తెర్లాం, సెప్టెంబరు 5: జిల్లాలో గంజాయి రవాణా నియంత్రణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. గురువారం బొబ్బిలి, తెర్లాం పోలీసు స్టేషన్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తరచూ రహదారి ప్రమాదాలు జరిగే బ్లాక్‌స్పాట్లను గుర్తించి ప్రమాదాలకు తావులేకుండా భద్రతా చర్యలు చేపడతామన్నారు. విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి ప్రజలకు రక్షణచట్టాలు, రహదారి భద్రత, మహిళల భద్రత, సైబర్ మోసాల పట్ల అవగాహన కల్పించాలని అన్ని పోలీసు స్టేషన్ల అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు. ప్రమాదాలు తరచుగా జరిగే స్పాట్లపై ఆరా తీశారు. వాటి నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. వేర్వేరు ప్రాంతాలలో వాహనాలను ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. రాత్రివేళల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వారి వేలిముద్రలు, ఫింగర్ ప్రింట్, చెక్ డివైజ్‌తో తనిఖీ చేయాలని ఆదేశించారు. స్టేషన్‌లో జనరల్ డైరీ, ఎఫ్ఐఆర్, ఇండెక్స్, రిసెప్షన్ రిజిస్టర్, సీడీ ఫైల్స్, గ్రేవ్ కేసులు, బీటు పుస్తకాలు, తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు కటకం సతీష్‌కుమార్, నారాయణరావు, స్పెషల్ బ్రాంచి సీఐ కేకేవీ విజయనాథ్, ఎస్ఐ లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: రామభద్రపురం పోలీసు స్టేషన్‌ను ఎస్పీ వకుల్ జిందాల్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే చాలా చోట్ల గంజాయి అక్రమ రవాణా నిరోధించామని, ఒడిసా రాష్ట్రం నుంచి ఎక్కువగా గంజాయి దిగుమతి చేస్తున్నట్టు గుర్తించామన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 29 గంజాయి కేసులు నమోదుచేసి 110 మందిని అరెస్టు చేశామన్నారు. గంజాయి నియంత్రణకు జిల్లాలో 5 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, ఇందులో భాగంగా రామభద్రపురంలోని కొట్టక్కి వద్ద ఒక చెక్‌పోస్టు ఉందన్నారు. అనంతరం పారాది బ్రిడ్జిని పరిశీలించి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐ వి.ప్రసాద్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బాడంగి పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ

బాడంగి: ప్రతి విద్యార్థిపట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. గురువారం బాడంగి పోలీసు స్టేషన్‌ను ఆయన సందర్శించారు. తొలుత పోలీసు స్టేషన్ పరిసరాలను, ప్రజలకు కౌన్సిలింగ్ కేంద్రాన్ని, ఖైదీల గదులను పరిశీలించారు. అనంతరం విలేఖర్లతో మాట్లాడారు. పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు గమనించాలన్నారు. ఇప్పటికే విద్యార్థులకు కాలేజీలు, పాఠశాలల్లో పోలీసు సిబ్బందితో కౌన్సిలింగ్ ఏర్పాటు చేశామని, త్వరలోనే గ్రామాల్లో కూడా మత్తుపదార్థాల వాడకం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఎస్ఐ తారకేశ్వరరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గణేష్ మండపాలకు అనుమతులు తప్పనిసరి

రాజాం రూరల్: నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి మండపాలు, పందిళ్లు ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని రాజాం రూరల్ సి.ఐ. ఉపేంద్రరావు ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. ప్రధానంగా ఉత్సవాల నిర్వహణ శాంతియుత వాతావరణంలో జరగాలని, అల్లర్లు, ఘర్షణలకు తావులేకుండా నిర్వాహకులు వ్యవహరించాలని ఆయన ఆదేశించారు. అశ్లీల నృత్యాలు, రికార్డింగ్ డాన్స్‌లకు అనుమతులు లేవని సీఐ గుర్తు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో ఉత్సవాలు నిర్వహించే వారు పంచాయతీ, మున్సిపాలిటీల నుంచి కూడా అనుమతులు తీసుకోవాలన్నారు.

రెగ్యులర్ ఈవోను నియమించాలి

రాజాం రూరల్: రెండు దశాబ్దాల చరిత్ర ఉన్న రాజాం నవదుర్గ దేవస్థానానికి రెగ్యులర్ ఈవోను నియమించాలని దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త వానపల్లి నరిశింగరావు దేవదాయశాఖ ఉన్నతాధికారులను కోరారు. ఈ మేరకు ఆ శాఖ ఏసీకి లేఖ రాశారు. ఇప్పటికే రెండువేల మందికి పైగా భవానీ దీక్షలు చేపట్టారని, అర్ధమండల దీక్షలు, నవరాత్రి దీక్షలు సైతం నిర్వహించాల్సి ఉందని, ప్రధానంగా దసరా ఉత్సవాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాల్సిన నేపథ్యంలో రెగ్యులర్ ఈవో లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆ లేఖలో పేర్కొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి పరామర్శ

రాజాం: ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ సోదరుడు కోండ్రు జగదీష్ గురువారం మున్సిపాలటీ పరిధిలోని కొండంపేట గ్రామంలో టీడీపీ కార్యకర్త బలిమి ఉమా మేనల్లుడు నందమూడి శశి ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని గురువారం పరామర్శించారు. మొగిలివలస గ్రామంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త వంజరాపు సూర్యనారాయణ కుటుంబాన్ని పరామర్శించారు.

కషాయం తయారీపై అవగాహన

బొబ్బిలి రూరల్: మండలంలోని జగన్నాథపురం గ్రామంలో గురువారం ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి ఉరిటి శంకరరావు ఆధ్వర్యంలో మహిళా రైతులకు నీమాస్త్రం, పలుపత్ర ద్రావణం తయారుచేసే విధానాన్ని, వాటి ఉపయోగాన్ని తెలియజేశారు. ప్రతి రైతూ ఈ కషాయాన్ని వాడి భూమిని ఆరోగ్యంగా ఉంచి, వరి తెగుళ్లు రానివ్వకుండా నివారణ చేసుకోవాలని, ఉత్పత్తి పెంచుకోవాలన్నారు. ఐసీఆర్పీ శ్రీరాములు, కన్నం నాయుడు, సునీత, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

సంపత్ వినాయక ఆలయంలో నవరాత్రి మహోత్సవాలు

విజయనగరం రూరల్: నగరంలోని సంపత్ వినాయక ఆలయంలో ఈ నెల 7 నుంచి తొమ్మిది రోజుల పాటు నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ వ్యవస్థాపకులు, సేవా కమిటీ చైర్మన్ యడ్ల పైడిరాజు చెప్పారు. గురువారం ఆలయ ఆవరణలో కమిటీ సభ్యులు, పురోహితులతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు స్వామి వారికి విశేష పూజలు జరుగుతాయని తెలిపారు. పూజలు అనంతరం భక్తులకు ఉచితంగా ప్రసాదాన్ని అందజేయనున్నట్టు తెలిపారు. వినాయక నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. నగరంలోని ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయంతం చేయాలన్నారు.

రోగికి ఆర్థిక సాయం

వేపాడ: వేపాడలో నోటి క్యాన్సర్‌తో బాధపడుతున్న కొలుపూరి రమణకు 'మన వేపాడ-మనసేస్తం' సభ్యులు గురువారం 5 వేలు రూపాయలు అందించారు. సంస్థ సభ్యులు సేనాపతి దేవుడుబాబు తదితరులు పాల్గొన్నారు.

వేగావతి ప్రవాహంపై అప్రమత్తంగా ఉండాలి

బాడంగి: మండలంలోని గొల్లాది గ్రామంలో వేగావతి నది పరివాహ ప్రాంతాన్ని తహసీల్దార్ కే.సుధాకర్ గురువారం పరిశీలించారు. నదిలో ప్రవాహం పెరిగిపోయినందున ప్రజలెవరూ అటుగా వెళ్లవద్దని దండోరా వేయించినట్టు తెలిపారు. ఆర్ఐ సోమయ్య, వీఆర్వో, ఎంపీటీసీ, సర్పంచ్ ఉన్నారు.

గ్రామసభలో వైసీపీ నాయకుడి తీరు సరికాదు

జామి: అలమండ గ్రామసభలో పంచాయతీ ఉప సర్పంచ్, వైసీపీ నేత లగుడు దేముడే అంతా తానై వ్యవహరించారు. గ్రామానికి మొదటి పౌరురాలైన సర్పంచ్‌ను వేదిక చివరికి తోసేసి, ఎంపీటీసీని పక్కన పెట్టి అందరి మధ్యలో సదరు వైసీపీ నేత కూర్చుని సభను నడిపించడం సరికాదని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు అనర్హులకు ఎలా చోటిస్తారని ప్రశ్నించారు. గ్రామసభలో సమస్యలు ప్రస్తావించగా ఆయనే అధికారులను వివరాలు కోరడం నిబంధనలను కాలరాయడమేనన్నారు.

వరద బాధితులకు మందులు

విజయనగరం దాసన్నపేట: విజయవాడ వరద బాధితుల సహాయార్థం జిల్లా మెడికల్ సేల్స్ అండ్ రిప్రంజటేటివ్ యూనియన్ నాయకులు రూ.30 వేలు విలువైన మందులను సేకరించి గురువారం ఎల్‌బీజీ భవనంలో సీపీఎం పార్టీ నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు రెడ్డి శంకరరావు, టీవీ రమణ మాట్లాడుతూ, ఇలా రాష్ట్ర వ్యాప్తంగా మందులు సమకూర్చి వరదబాధితుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ముందుకొచ్చిన యూనియన్ నాయకులు యుఎస్ రవికుమార్, ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. సభ్యులు శ్రీనివాసరావు, జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

బొబ్బిలి: వచ్చే నెల 6 నుంచి మూడు రోజుల పాటు ఏపీటీఎఫ్ రాష్ట్ర విద్యావైజ్ఞానిక మహాసభలు నిర్వహించనున్న నేపథ్యంలో గురువారం బొబ్బిలిలో ఉపాధ్యాయులకు షటిల్ టోర్నమెంట్ నిర్వహించారు. విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు.

మూసేసిన కాలువపై ట్రాన్స్‌ఫార్మర్

● అధికారుల నిర్లక్ష్యం ● పట్టించుకోని పంచాయతీ

● నీట మునుగుతున్న ప్రభుత్వ పాఠశాల, విశాఖ-అరకు రోడ్డు

శృంగవరపుకోట, సెప్టెంబరు 5: అక్కడి వ్యాపారులు ఏకంగా మురుగునీటి కాలువనే మాయం చేసేశారు. తమకు అనుకూలంగా దారి మళ్లించేశారు. ఈ విషయాన్ని పరిశీలించకుండా మూసేసిన కాలువ కల్వర్టుపైనే విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫా ర్మర్‌ను నిర్మించారు. పర్యవసానంగా వర్షాల సమయంలో వరద నీరు ప్రవహించే మార్గం లేక శృంగవరపుకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలోకి వరద నీరు పోటెత్తుతోంది. ఈ పరిస్థితికి విసిగివేసారి పోయిన పాఠశాల యాజమాన్య కమిటీ సమస్యను గురువారం తహసీల్దార్ అరుణ కుమారి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె తక్షణం స్పందించి సర్వేయర్ వెంకటరావుతో కలిసి మూసేసిన మురుగు కాలువ స్థలాన్ని గుర్తించారు. కాలువను తిరిగి తవ్వించేందుకు ప్రయత్నించగా దానిపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండడం చూసి ఆశ్చర్యపో యారు. ఈ కాలువపై పలు చిరువ్యాపారులకు చెందిన దుకాణాలు వున్నాయి. ముందుభాగంలో వ్యాపారం చేసుకుంటున్న యజమానులు వెనుకనున్న కాలువను కప్పేసి వాడుకుంటున్నారు. దీంతో వరద నీరు బయటకు వెళ్లే అవకాశం లేక పాఠశాల మైదానం, విశాఖ-అరకు రోడ్డుపైకి వస్తున్నట్లు గమనించిన తహసీల్దార్ అక్రమణలను తొలగించాలని ఆదేశించారు.

● ఆమె పరిశీలనతో పంచాయతీ, విద్యుత్, ఆర్అండ్‌బి శాఖ అధికారుల బాధ్యతారాహిత్యం బయటపడింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీ నుంచి విశాఖ-అరకు రోడ్డు కింద భాగంలో కల్వర్టు ఉంది. వ్యవసాయ కార్యాలయం, పాత విద్యుత్ శాఖ కార్యాలయం ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీకు ఆనుకుని వున్న కాలువ నుంచి ఈ కల్వర్టు ద్వారా వరద నీరు బయటకు రావాలి. దీన్ని చాలా ఏళ్ల క్రితం మూసేసారు. దీనివల్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో వర్షం తగ్గి వారం రోజులు దాటినా వరద నీరు పోవడం లేదు. చెత్తాచెదారం కుళ్లి దోమలు, ఈగలు, పందులకు ఆవాసాలుగా మారింది.



ఎస్.కోటలో మురుగునీటి కాలువపై నిర్మించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



తహసీల్దార్ అరుణకుమారి, వాణిజ్య సముదాయ యజమానులు మధ్య వాగ్వాదం

మహిళలకు శిక్షణ ధ్రువపత్రాలు

శృంగవరపుకోట: రాష్ట్ర తెలుగు దేశం పార్టీ అధికార ప్రతినిధి గొంప కృష్ణ విద్యా సంకల్పం ద్వారా శృంగవరపుకోట పట్టణంలో టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ పొందిన మహిళలకు గురువారం విశాఖ ఎంపీ శ్రీభరత్, స్థానిక శాసన సభ్యురాలు కోళ్ల లలిత కుమారితో కలసి ధ్రువపత్రాలు అందించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఈ శిక్షణ ఎంతో దోహదపడుతుందన్నారు. మహిళల సంపాదనకు శిక్షణ ఇచ్చేందుకు సహకరించిన గొంప కృష్ణను అభినందించారు. ఇదే కార్యక్రమంలో ఇద్దరి ప్రజా ప్రతినిధుల సమక్షంలో పలువురు రాష్ట్రంలోని వరద బాదితులకు ఆర్థిక సహాయం అందించారు. శ్రీవివేకానంద విద్యాసంస్థల అధిపతి రూ. 1లక్ష చెక్కు, శ్రీభవాని జూయలర్స్ రూ.25వేలతో పాటు పలువురు ఇచ్చిన విరాళాలు మొత్తం కలిపి రూ.1.82 లక్షలు అందాయి. విశాఖ పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు గండి బాబ్జీ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్ తదితరులున్నారు.



శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్‌లు అందిస్తున్న ఎంపీ శ్రీభరత్

వెంగళరాయ సాగర్ కాలువను పరిశీలించిన ఎమ్మెల్యే



కాలువను పరిశీలిస్తున్న బేబీనాయన

బొబ్బిలి రూరల్: మండలంలోని సీహెచ్ బొడ్డవలస గ్రామం శివారున ఉన్న వెంగళరాయ సాగర్ కాలువను (15ఎల్ - 16ఎల్) గురువారం నీటిపారుదల శాఖాధికారులతో కలిసి బొబ్బిలి నియోజక వర్గం ఎమ్మెల్యే సందర్శించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. ఈ కాలువ ఆధారంగా ఉన్న రైతులకు నీటి ఎద్దడి లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తు నీటిని అందించే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. మండల పార్టీ అధ్యక్షుడు వాసిరెడ్డి సత్యనారాయణ, ఎంపీటీసీ వెన్నెల నాగరాజు, వెలగవలస మాజీ సర్పంచ్ రెడ్డి సంజీవనాయుడు, అధికారులు, టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

వరద బాధితుల సేవలో మంత్రి కొండపల్లి

విజయనగరం (ఆంధ్రజ్యోతి): బుడమేరు వరదల ప్రభావంతో విజయవాడ, గుంటూరులో సంభవించిన వరదలు, ముంపు ప్రభావానికి గురైన ప్రజలకు సేవలు అందించే క్రమంలో రాష్ట్ర మంత్రి, విజయనగరం జిల్లాకు చెందిన కొండపల్లి శ్రీనివాస్ చొరవను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రశంసించారు. చంద్రబాబు ఆదేశాల మేరకు విజయవాడలోని 57, 58, 59, 60 డివిజన్లలో గడిచిన 4 రోజుల నుంచి అక్కడే ఉంటూ ఎప్పటికప్పుడు అధికారులతో సమావేశమై ప్రజలకు సేవలు అందించే విధంగా చర్యలు చేపడుతున్నారు. సింగ్‌నగర్‌లో పర్యటించిన చంద్రబాబు ప్రభుత్వ సహాయ కార్యక్రమాల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ ప్రజలంతా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చూపిస్తున్న చొరవ, కృషి అభినందనీయమని చెప్పడంతో.. చంద్రబాబు కూడా మంత్రిని అభినందించారు.



సహాయక చర్యలను పరిశీలిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

దివ్యాంగులకు కొత్త జీవితాలు

కొత్తవలస: దివ్యాంగుల్లో కొత్తజీవితాలను గురుదేవా చారిటబుల్ ట్రస్టు ప్రారంభిస్తోందని విశాఖపట్టణం ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. గురువారం మండలంలోని గురుదేవ చారిటబుల్ ట్రస్టు వార్షికోత్సవం సందర్భంగా ట్రస్టు ద్వారా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 27 సంవత్సరాల కిందట చిన్నగా ప్రారంభించిన ట్రస్టు తమ సేవా కార్యక్రమాలను దేశంలోని దాదాపుగా 15 రాష్ట్రాలకు విస్తరించడం చాలా గొప్ప విషయమన్నారు. ఈ ట్రస్టును ఈ విధంగా అభివృద్ధి చేసిన జగదీష్ బాబు అభినందనీయుడన్నారు. కార్యక్రమానికి హాజరైన ఎస్.కోట శాసన సభ్యురాలు కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ దివ్యాంగుల్లో వెలుగులను ఈ ట్రస్టు ద్వారా నింపుతున్నారన్నారు. చోడవరం ఎమ్మెల్యే బండారు సత్యనారాణయణ మూర్తి మాట్లాడారు. కార్యక్రమంలో 10 టైలరింగ్ మిషన్స్, దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను, 200 మంది పిల్లకు మట్టి వినాయక విగ్రహాలను, 100 భజన మండలి గ్రూపులకు చీరలు 70మంది అంధులకు పింఛన్‌లు అందచేశారు. కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు పీలాగోవింద సత్యన్నారాయణ, గండి బాబ్జీ, స్టూడెంట్స్ ఆఫ్‌బనారస్ హిందూ యూనివర్శిటీ నాయకుడు రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

'నడుస్తున్న చరిత్ర' పుస్తకావిష్కరణ

విజయనగరం దాసన్నపేట: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలపై జిల్లా కేంద్రానికి చెందిన రచయిత, తెలుగుభాష విశిష్ట పురస్కార గ్రహీత ఎస్ గురుప్రసాద్ రాసిన 'నడుస్తున్న చరిత్ర' పుస్తకాన్ని కేంద్రమాజీ మంత్రి అశోక్ గజపతిరాజు గురువారం ఆయన నివాసంలో ఆవిష్కరించారు. 2024 ఎన్నికల్లో 175 నియోజకవర్గాల ఫలితాలతో పాటు ఫలితాలను ప్రభావితం చేసిన వివిధ అంశాలపై పార్టీల వారీగా విశ్లేషణ బాగుందని అశోక్ గజపతిరాజు అభినందించారు. బీజేపీ నాయకుడు భవిరెడ్డి శివప్రసాద్, గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రొంగలి పోతన్న, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అశోక్

గిరిజన గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలి

బొబ్బిలి/రూరల్: మండల పరిధిలోని గిరిజన గ్రామాలైన కృపావలస, దీవెనవలస, సీయోనువలస, చిన అక్కేనవలస గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ ఆధ్వర్యంలో బొబ్బిలి ఎలక్ట్రికల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒమ్మి రమణ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పోడు వ్యవసాయం చేసుకుంటూ నివాసం ఉంటున్న గిరిజనులకు గత కొన్ని సంవత్సరాలుగా విద్యుత్ సౌకర్యం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎలక్ట్రికల్ డీఈకి వినతి పత్రం అందజేశారు. ప్రగతిశీల కార్మిక సమాఖ్య కార్యదర్శి సత్యం, సీపీఐ పట్టణ నాయకులు కృష్ణ, వై బాబ్జీ, సీహెచ్ చిరంజీవి, బిహేన్, రాజు, జీరా పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

లోతట్టువాసులకు వరద హెచ్చరికలు

రేగిడి: వాయుగుండం ప్రభావం వల్ల మళ్లీ రెండురోజులపాటు వర్షాలు కురుస్తాయన్న నేపథ్యంలో మండలంలో 12 నాగావళితీర ప్రాంత లోతట్టు గ్రామాల్లో స్థానిక రెవెన్యూశాఖ గురువారం వరద హెచ్చరికలు జారీచేసి అప్రమత్తంచేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో దండోరా వేసి హెచ్చరించినట్లు తహసీల్దార్ ఎల్లారావు తెలిపారు. క్షేత్రస్థాయిలో ఖండ్యాం, వెంకటాపురం, కొమిర తదితర గ్రామాల్లో తహసీల్దార్ పర్యటించి పరిస్థితులను ఆరా తీశారు. ప్రస్తుతం నాగావళీ నదీ నిలకడగా ఉన్నట్లు, మండలంలో వరదప్రభావం అంతగా ఉండొకపోవచ్చు అని అభిప్రాయపడ్డారు.

వరద బాధితులకు సాయం

లక్కవరపుకోట: విజయవాడ, గుంటూరు వరద బాధితుల సహాయార్థం మండలంలో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో విరాళాలు వసూలు చేశారు. జిల్లా నాయకులు గాడి అప్పారావు ఆధ్వర్యంలో తరిని వెంకటరమణ తదితరులు ఇంటింటా వసూళ్లు చేసి సీఎం సహాయనిధికి పంపారు. రూ.7 వేల 40లు వ సూళైందని అప్పారావు తెలిపారు. పార్టీలకు అతీతంగా అందరూ స్పందించాలని ఆయన కోరారు.

పౌష్టికాహారంపై ప్రతి ఒక్కరూ దృష్టిసారించాలి

రామభద్రపురం: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మహిళలు, బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారంపై దృష్టిసారించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యకుమారి తెలిపారు. మండల కేంద్రంలో గురువారం పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న పిల్లలు రక్తహీనతకు గురికాకుండా ఉండేందుకు ఏయే ఆహారం తీసుకోవాలి అనే దానిపై సూచనలు, సలహాలు అందించారు. పోషకాహార మహోత్సవాల్లో భాగంగా జన్నివలసలో గర్భిణులకు సీమంతాలు జరిపారు. అనంతరం వెయ్యి రోజుల సంరక్షణ గురించి తల్లులకు అవగాహన కల్పించారు. ఆరికతోట ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కూడా పెద్ద ఎత్తున పోషకాహార మహోత్సవాలు నిర్వహించారు. రామభద్రపురం మండల కేంద్రంలో కూడా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యకుమారి ఆధ్వర్యంలో ర్యాలీలు, అవగాహనా సదస్సులు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ సీహెచ్‌లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ● **బొబ్బిలి రూరల్:** మండలంలోని కొత్తపెంట అంగన్‌వాడీ సెంటర్‌ను గురువారం ఎంపీడీవో రవికుమార్ గ్రామ సర్పంచ్ చోడవరపు సూర్యనారాయణతో కలిసి సందర్శించారు. అనంతరం ప్రీస్కూల్ పిల్లలకు సప్లై చేసిన ఆట వస్తువులు, సిలబస్ బుక్స్, పోషకాహార స్టాల్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సెక్టార్ సూపర్వైజర్ బినిర్మల, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు. ● **తెర్లాం:** మండలంలో లోచర్లలో పోషణ మహోత్సవాల కార్యక్రమాన్ని సీడీపీవో రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భంపొందిన ప్రతి తల్లికీ పోషకాలు చాలా అవసరమని, ఈ పోషకాలే బిడ్డ ఎదుగుదలకు చాలా ఉపమోగపడతాయని, అందుచేత ప్రతి తల్లి గర్భందాల్చిన సమయంలో తప్పని సరిగా పోషకాలను తీసుకోవాలన్నారు. సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, టీచర్లు, గర్భిణులు పాల్గొన్నారు.

పర్యవరణ పరిరక్షణకు మేముసైతం..

రేగిడి: మండలంలో కొండవలస గ్రామస్థులు పర్యవరణ పరిరక్షణకు నడుం బిగించారు. ఇక్కడ యూత్, పెద్దలు అంతా ఒకటై గ్రామంలో వినాయక చవితికి మట్టివినాయకులు వినియోగం, గ్రామంలో మొక్కలు నాటేందుకు నిర్ణయించారు. గురువారం రాజాం రూరల్ సర్కిల్ సీఐ ఉపేంద్రను ఆహ్వానించి ఆయన సమక్షంలో 250 వరకు మట్టి వినాయకులు పంపిణీ చేసి, పాఠశాల అవరణంలో మొక్కలు నాటారు. ఇంటింటా మొక్కలు నాటి పర్యవరణ పరిరక్షణకు పాటుపాడదామని ఒక నిర్ణయానికి వచ్చారు.

చేపలవేటాడుతూ యువకుడి మృతి

● విశాఖ తీరంలో ఘటన ● మృతుడిది తిప్పలవలస

పూసపాటిరేగ: మండలంలో తిప్పలవలస గ్రామానికి చెందిన మత్స్యకారుడు గనగళ్ల పెద్దయ్య(రాజు)(24) సముద్రంలో చేపలవేట చేస్తుండగా ప్రమాదవశాత్తు మృతి చెందాడు. జీవనభృతి కోసం విశాఖ హార్బర్ నుంచి మరికొంత మందితో కలిసి 7 రోజుల క్రితం చేపలవేటకు బోటులో వెళ్లాడు. అయితే బుధవారం రాత్రి వలను లాగుతున్న సమయంలో సముద్రం అల్లకల్లోలంగా ఉండటంతో తూలి సముద్రంలో పడినట్లు స్థానికులు తెలుపుతున్నారు. తోటి మత్యకారులు గాలింపు చర్యలు చేపట్టగా అప్పటికే మృత్యువాత పడి సముద్రంలో దొరికినట్లు తెలిపారు. ఇతడు మృతి చెందినట్లు గురువారం వారి కుటుంబసభ్యులకు సమాచారం రావటంతో తల్లిదండ్రులు బసంగి, అమ్మోరు విశాఖకు చేరుకున్నారు. గురువారం రాత్రి 8గంటల ప్రాంతంలో మృతదేహంతో బోటు విశాఖకు చేరుకుంది. రాజు మృతితో కుటుంబసభ్యులు విచారంలో ఉన్నారు.



పెద్దయ్య(ఫైల్)

జలాశయంలో పడి..

మెంటాడ: చేపలవేటకు వెళ్లిన యువకుడు ఆంధ్ర జలాశయంలో మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఆంధ్ర ఎస్ఐ దేవి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం బీటీ గరువు గ్రామానికి చెందిన గమ్మెలా భీమరాజు(22) మరో ముగ్గురితో కలిసి మంగళవారం రాత్రి జలాశయంలో చేపలవేటకు వెళ్లారు. సహచరులను వదిలి భీమారావు వేరే మూలకు పెద్దచేపల కోసం వేటకు వెళ్లాడు. బుధవారం వేకువజాము వరకు రాకపోవడంతో జలాశయంలో వారంతా గాలించారు. ఆచూకీ లభించలేదు. ఇంటికి వెళ్లిపోయాడేమోనని భావించి వారంతా వెనుదిరిగారు. ఇంటికి రాలేదని తెలుసుకున్న కుటుంబసభ్యులు బంధువుల ఇళ్లల్లో వెతకడం ప్రారంభించారు. ఈ క్రమంలో గురువారం జలాశయంలో విగతజీవిగా భీమారాజు కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని జలాశయం నుంచి బయటకు తీశారు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని గుర్తించిన అనంతరం పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి కేసులో ఏడుగురు అరెస్టు

డెంకాడ: డెంకాడ మండలం చింతలవలస సమీపంలో గల ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎదురుగా ఉన్న నీలగిరి తోటలో గంజాయి క్రయవిక్రయాలు చేస్తున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 2 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డెంకాడ మండలం, శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు, అదేవిధంగా అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన వ్యక్తితో కలిసి గంజాయి విక్రయిస్తున్నట్లుగా ఈ నెల 4వ తేదీన డెంకాడ పోలీసులకు సమాచారం అందింది. దీనిపై డెంకాడ ఎస్ఐ సన్యాసినాయుడు, పోలీస్ సిబ్బంది, రెవెన్యూ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. నీలగిరి తోటలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని, కొంటున్న 4 గురిని అదుపులోకి తీసుకుని, 2 కిలోల గంజాయి, 1 స్కూటీ, నాలుగు వందల నగదును డెంకాడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విచారణ నిమిత్తం వారిని అదుపులోనికి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.

ఎన్‌సీఎస్‌లో ట్రాన్స్‌ఫార్మర్ పరికరాలు చోరీ

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేట ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారంలో చోరీ జరిగిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఫ్యాక్టరీ ఆవరణలోని ట్రాన్స్‌ఫార్మర్ పరికరాలు చోరీకి గురికావడంతో గురువారం క్లూస్ టీము కర్మాగారం పరిసరాలను పరిశీలించింది. ట్రాన్స్ ఫార్మర్‌లో రాగి వైరు, ఆయిల్ చోరీకి గురైనట్లు కర్మాగారం ఇన్‌చార్జి ఎన్.సతీష్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఏడాది మే 31న శుభ్రపరిచిన అనంతరం గతనెల 31న శుభ్రం చేయగా అప్పటికే ట్రాన్స్ ఫార్మర్ ఓపెన్‌గా ఉండడం గమనించారు. ఈ నేపథ్యం బుధవారం సీతానగరం పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. గురువారం ఎస్ఐ ఎం.రాజేష్, క్లూస్ టీము ఎస్ఐ స్వరూప్‌లు ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. చోరీ వెనుక కుట్ర దాగి ఉంటుందని చెరకు రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. భారీ వాహనాలు ఏర్పాటు చేసుకుని ఎక్కువ సమయాన్ని కేటాయిస్తే కానీ ఇంత పెద్ద చోరీకి ఎవరు పాల్పడలేరని చెబుతున్నారు.

పిడుగుపాటుకు గృహోపకరణాలు ధ్వంసం

తెర్లాం: మండలంలో రంగప్పవలస మధుర గ్రామమైన తమ్మయ్యవలసలో గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి ఓ ఇంటిపైన పిడుగు పడింది. దీంతో బొత్స ఈశ్వరమ్మ ఇంటిలోని మోటర్ బోరు, విద్యుత్‌లైన్, ఏసీ, ఫ్రిడ్జ్, తదితర విలువైన వస్తువులు కాలిపోయాయి. సమాచారం మేరకు రెవెన్యూ సిబ్బంది నరసింహనాయుడు, సర్పంచ్ రాంబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని వారు తెలిపారు.



పిడుగుపాటుకు పెచ్చులూడిన గోడ, కాలిపోయిన విద్యుత్ సామగ్రి

ఇసుక ట్రాక్టర్ సీజ్

వంగర: మండలంలోని ఒనీ నాగావళి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్సై షేక్ శంకర్ తన సిబ్బందితో కలిసి పటుకుని సీజ్ చేశారు. నాగావళి నది నుంచి ప్రతి రోజూ వాహనాలు తిరుగుతున్నాయన్న సమాచారంతో గురువారం రాత్రి దాడులు చేసి, ఒకరిని అరెస్టు చేసి, ట్రాక్టర్ సీజ్ చేశామన్నారు.

సర్వేపల్లిని స్ఫూర్తిగా తీసుకోవాలి

● జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవం


గరుగుబిల్లి: కొత్తూరు జడ్పీ పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎస్‌ఐ రమేష్‌నాయుడు


కురుపాం: చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులకు సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఉపాధ్యాయుడు వృత్తికి వన్నెతెచ్చిన మహనీయుడు సర్వేపల్లి అని తెలిపారు. అనంతరం సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


సీతంపేట: ఐటీడీఏలో ఉపాధ్యాయునికి సత్కరిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ


భామిని: ఎమ్మార్సీలో ఉపాధ్యాయునికి సన్మానిస్తున్న ఎంఈవోలు


సీతంపేట రూరల్: సీతంపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో..


వీరఘట్టం: చిట్టిపుడివలసలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


గుమ్మలక్ష్మీపురం: ఏకలవ్య పాఠశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి


పార్వతీపురం టౌన్: గురువులను సన్మానిస్తున్న నోబుల్ వాకర్స్ క్లబ్ సభ్యులు

వీవోఏలకు బకాయి వేతనాలు చెల్లించాలి


పీడీ సత్యంనాయుడుకి వినతిపత్రం అందజేస్తున్న వీవోఏలు

బెలగాం: వీవోఏలకు బకాయి వేతనాలు చెల్లించాలని, అక్రమ తొలగింపులు, వేధింపులు ఆపాలని సీఐటీయూ నాయకులు యమ్మల మన్మథరావు డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టరేట్ వద్ద సీఐటీయూఆధ్వర్యంలో వీవోఏలు గురువారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా మన్మథరావు మాట్లాడుతూవీవోఏలకు ఆరునెలలుగా వేతనాలు ఇవ్వలేదని తెలిపారు. రెండు నెలలుగా తొమ్మిది మంది వీవోఏలను అక్రమంగా తొలగించారని, తక్షణమేవారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. అనంతరం వెలుగు పీడీ సత్యం నాయుడుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఇందిరా, రెడ్డి వేణు, బంకురు సూరిబాబు, జి.వెంకటరమణ పాల్గొన్నారు.

క్షేత్ర సహాయకుడిపై విచారణ


విచారణ నిర్వహిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

జియ్యమ్మవలస: మండలంలోని పెదబుడ్డిడిలో క్షేత్ర సహాయకుడిపై గ్రామ రైతుసేవాకేంద్రం వద్ద గురువారం ఎంపీడీవో పి.శ్రీనివాసరావు, ఏపీవో కె.శ్రీనివాసరావు విచారణ చేపట్టారు. కలెక్టర్ గ్రీవెన్స్‌కు గతనెల 14న క్షేత్ర సహాయకుడిపై బెవర సత్యనారాయణ తదితరులు ఫిర్యాదుచేశారు. వేతనదారుల నుంచి రూ.100 చొప్పున, పని బుక్కుకోసం రూ.50 చొప్పున, గ్రామంలో లేనివారు, పనిచేయని వారి పేర బిల్లులు వేసి వారి వద్ద నుంచి వసూలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా విచారణ అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు.

జాబ్‌మేళాలో 55 మంది ఎంపిక

సీతంపేట: సీతంపేటలోని పీఎంఆర్‌సీలో ఐటీడీఏ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాకు 120మంది హాజరుకాగా 55 మందిని ఎంపిక చేసినట్లు ఏపీవో చిన్నబాబు తెలిపారు. అమెజాన్ సంస్థలో ఉద్యోగాల కోసం నిర్వహించిన జాబ్‌మేళాలో కేఎల్ గ్రూప్ సంస్థ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌వో ఎస్‌వీ గణేష్, వెలుగు ఏపీడీ ఆర్‌వీ రమణ, వైటీసీ మేనేజర్ వెంకటరమణ, కేఎల్ గ్రూప్ ప్రతినిధులు టి.సత్యనారాయణ, రామాంజనేయులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

● డిప్యూటీ డీఎంహెచ్‌వో జగన్మోహనరావు


సిబ్బందికి సూచనలిస్తున్న జగన్మోహనరావు

గరుగుబిల్లి: పీహెచ్‌సీల సిబ్బంది విధులపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంహెచ్‌వో తెర్లి జగన్మోహనరావు హెచ్చరించారు. గురువారం గరుగుబిల్లి పీహెచ్‌సీని తనిఖీ చేశారు. తొలుత చికిత్సకోసం వచ్చిన రోగుల నుంచి వైద్య సేవలపై ఆరాతీశారు. సమస్యలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదుచేయాలని తెలిపారు. రోగులకు అసౌకర్యం కలగకుండా సేవలందించాలని సూచించారు. గ్రామాల్లో సీజనల్‌జ్వరాల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు, మందులపై డాక్టర్ సంతోష్‌కుమార్ నుంచి వివరాలు సేకరించారు. పాము, కుక్కకాటు వ్యాక్సిన్లతో పాటు మందుల కాల పరిమితిని తనిఖీచేయాలని ఫార్మాసిస్టు దాసరి మృత్యుంజయరావుకు సూచించారు. 24గంటలు ఆసుపత్రిలో సిబ్బంది అందుబాటులోఉండాలని తెలిపారు. జ్వరాలకు సంబంధించి ఇంటింటా సర్వే, వైద్య శిబిరాలను నిర్వహించాలని కోరారు.

రాయగడలో గురుపూజోత్సవం


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న కలెక్టర్ పారుల్ పట్వారి

రాయగడ: రాయగడ జీసీడీ ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో గురుపూజాదినోత్సవాన్ని జిల్లా యంత్రాంగం నిర్వహించింది. ఈ సందర్భంగా కలెక్టర్ పారల్ పట్వార్ ఇటీవల పదవీవిరమణ చేసిన ఉపాధ్యాయులు, 11 సమితులకు చెందిన ఉత్తమఉపాధ్యాయులకు, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీ ప్రాజెక్టు డైరెక్టర్ నిహార్‌రంజన్ కహార్, సబ్ కలెక్టర్ కళ్యాణ సంఘమిత్ర దేవి, అదనపు కలెక్టర్ భాస్కర రోయిత్ పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన

రాయగడ: స్థానిక మహిళా కళాశాలలో జిల్లా న్యాయసేవా ప్రాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా సర్క్యూట్ న్యాయాధికారి సత్యనారాయణ షడంగి ఆదేశాల మేరకు కార్యదర్శి సుబ్రతఆచార్య అధ్యక్షతన గురువారం న్యాయఅవగాహన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా యాసిడ్‌దాడులు, పోక్సో చట్టంపై వివరించారు. కార్యక్రమంలో న్యాయవాది శుభ్రపండా, జిల్లా కేంద్ర చికిత్సాలయా వైద్యులు శుభశ్రీ పాణిగ్రాహి పాల్గొన్నారు.

విద్యార్థులపై దాడికేసులో 14 మంది అరెస్ట్

రాయగడ: రాయగడ అటానమస్ కళాశాలలో దాడికేసులో 14 మంది అరెస్ట్ చేసినట్లు పోలీసులుతెలిపారు. మంగళవారం 30 మందికిపైగా యువకులు చొరబడి విద్యార్థులపై దాడిచేసిన విషయం తెలిసిందే. దీంతో విద్యార్థులు కళాశాల ఎదుట నిరసన తెలపడంతో ఎస్పీ హరిష్ బీసీ నిందితులను త్వరలో పట్టుకుంటామని విద్యార్థులకు హామీఇచ్చారు. ఈమేరకు ఎస్‌డీపీవో ఆర్.సేనాపతి, రాయగడ పోలీసుస్టేషన్ ఐఐసీ కేకేబీకే కహార్‌లు విచారణ జరిపి దాడికి సంబంధించి 14మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మిగిలిన వారిని కూడ త్వరలో పట్టుకుంటామని పోలీసులు వెల్లడించారు.


కురుపాం: ఆసుపత్రి ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు


గుమ్మలక్ష్మీపురం: ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

సీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేయాలి

● కురుపాంలో సీపీఎం నాయకుల నిరసన

కురుపాం: కురుపాం సీహెచ్‌సీని వందపడకల ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్‌చేశారు. గురువారం సీహెచ్‌సీ ఎదుట సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ గిరిజనులకు నాణ్యమైన వైద్య సేవలు అందక మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, వైరల్ జ్వరాలతో ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. కురుపాంలో డెంగ్యూ నిర్ధారణ కేంద్రం లేకపోవడంతో పలువురు ప్రైవేట్ వైద్యులను ఆశ్రయిస్తున్నారని చెప్పారు. మలేరియా నిర్ధారణకు క్యూబీసీ, డెంగూ నిర్ధారణకు ఎలిసా టెస్టు, వివిధ రక్త పరీక్ష పరికరాలు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. తక్షణమే కొత్తగా భవనం ప్రారంభించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో దోమ తెరలు పంపిణీ చేయాలని కోరారు. ఆసుపత్రి సూపరిం టెండెంట్ శోభారాణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం. శ్రీనివాసరావు, సీతారాం, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భద్రగిరి ఆసుపత్రిని అభివృద్ధి చేయాలి

●**గుమ్మలక్ష్మీపురం:** భద్రగిరి ఆసుపత్రిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని, సగంలో నిలిచిపోయిన అదనపు భవనాలను పూర్తి చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. భద్రగిరి సీపీఎం నాయకులు మండంగి రమణ, అవినాష్ ధర్నా నిర్వహించారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

●నేటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ●గరుగుబిల్లిలో సమీక్ష


సిబ్బందికి సూచనలిస్తున్న అధికారులు

గరుగుబిల్లి: భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న దృష్ట్యా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలనిఇన్‌చార్జి తహసీల్దార్ పి.సత్యలక్ష్మికుమార్, ఎంపీడీవో జి.పైడితల్లిలు సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీవోకార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ శుక్రవారం నుంచి ఎనిమిదో తేదీ వరకూ భారీ వర్షాలు కురిసే అవకాశముందని, గ్రామాల్లో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా పర్యవేక్షించాలని కోరారు. సిబ్బంది విపత్తులు నిర్వహణపై రెండు టీములుగా విభజించినట్లు తెలిపారు. తహసీల్దార్‌కార్యాలయంలో కంట్రోల్ రూమును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గ్రామస్థాయిలో ఇంటింటా సర్వే నిర్వహించాలన్నారు. నిత్యావసర వస్తువులు కొరత లేకుండా ముందస్తుగా సమకూర్చుకోవాలని అవగాహన కల్పించారు. చెరువులకు గండ్లు పడకుండా దృష్టి సారించాలన్నారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాలల్లో బోధనజరగకుండా సురక్షిత ప్రాంతాల్లో తరగతులు నిర్వహించాలన్నారు. గ్రామస్థాయిలో వీఆర్‌వోలు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, సీనియర్ సహాయకులు రమేష్, ఆర్ఐ ఎం.కృష్ణ పాల్గొన్నారు.

పౌష్టికాహార మాసోత్సవాలపై అవగాహన


మాట్లాడుతున్న అప్పారావు

కురుపాం: పౌష్టికాహార మాసోత్సవాలు విజయవంతం చేయాలని ఎంపీడీఓ అప్పారావు కోరారు. గురువారం హుకుంపేటలో పౌష్టికాహార మాసోత్సవాలపై తహసీల్దార్ రవణమ్మ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహనకల్పించారు. ఈసందర్భంగా ఈనెల 30వ వరకు జరిగే కార్యక్రమంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఐసీడీఎస్ పీవో వీవీ రమణమ్మ పాల్గొన్నారు.

● **సాలూరు రూరల్:** మండలంలోని మావుడి తదితర గ్రామాల్లో పోషణ అభియాన్ వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. పోషకాహార ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు లక్ష్మి, విజయలక్ష్మి, అనురాధ పాల్గొన్నారు.

పెద్దగదబవలసలో పీఎం జన్‌మన్


మాట్లాడుతున్న వెంకటరమణ

వీరఘట్టం: మండలంలోని పెద్దగదబవలసలో గురువారం పీఎం జన్‌మన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటరమణ మాట్లాడుతూ గ్రామసభల ద్వారా ప్రజల అవసరాలను తెలుసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం శివున్నాయుడు, నాగభూషణరావు పాల్గొన్నారు.

డెంగ్యూ రోగులకు వైద్య సేవలు

సీతంపేట రూరల్: డెంగ్యూతో బాధపడుతున్న రోగులను ప్రత్యేకంగా పరీక్షించి వైద్యం అందిస్తున్నట్లు సీతంపేట ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆస్పత్రిలో డెంగ్యూ జ్వరంతో బాధపడుతున్న వారిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏప్రిల్ నుంచి ఇప్పటివరకూ వరకు మొత్తంగా 18 డెంగ్యూ కేసులు నమోదైనట్లు చెప్పారు.

తలనీలాలకు వేలంపాట

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవెంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానం ప్రాంగణంలో గురువారం పార్వతీపురం గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారి ఎం.ప్రసాద్ పర్యవేక్షణలో తలనీలాలు, కొబ్బరి చెక్కుల కోసం వేలం పాట నిర్వహించారు. తలనీలాలు సుమారు 47 కిలోలను రూ. 1.75 లక్షలకు ఏలూరుకు చెందిన వై.వెంకటేశ్వరరావు, కొబ్బరి చెక్కులు సేకరణ ఏడాదికి గాను రూ. 28,800లకు తోటపల్లికి చెందిన ఎం.సీతంనాయుడు వేలంపాటలో దక్కించుకున్నారని ఈవో వీవీ సూర్యనారాయణ తెలిపారు. దేవదాయశాఖ నిబంధనల మేరకు వేలం నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో అర్చకులు వీవీ అప్పలాచార్యులు, ప్రతినిధులు ఎం.వాసునాయుడు, ఎం.పకీరునాయుడు, ఎం.సీతంనాయుడుతో పాటు సిబ్బంది ఎం.బలరాంనాయుడులు ఉన్నారు.

సీతంపేటలో వర్షం

సీతంపేట: సీతంపేటలో గురువారం సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో రైతులు పంట పొలాల గట్లు తెగిపడిపోకుండా చర్యలు తీసుకుంటున్నారు. కాగావిషజ్వరాలు అధికంగా నమోదు కావడం జాగ్రత్తలు పాటించాలని వైద్యులు కోరుతున్నారు.

●**వీరఘట్టం:** వీరఘట్టం గురువారం సాయం త్రం వర్షం కురిసింది. ఉదయం ఎండతీ వ్రతకు ప్రజలు అల్లాడిపోయారు. కాగా సాయం త్రం వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది.

గరుగుబిల్లిలో జైగురుదత్త హోమం

గరుగుబిల్లి: గరుగుబిల్లి షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం జైగురుదత్త హోమం ఘనంగా జరిగింది. ఉదయం సుప్రభాత సేవ, కాకడ హారతితో పాటు విశేష అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టానికి చెందిన యజ్ఞ యాగకర్త ఎస్‌వీఎల్‌ఎన్ శర్మయాజీ సహకారంతో శ్రీఅనగాదేవి సహిత జైగురుదత్త హోమాలను నిర్వహించినట్లు అర్చకులు నల్లకాంతం శ్రీనివాసరావు తెలిపారు. హోమం కార్యక్రమంలో పాల్గొన్న దంపతులకు దీక్షా వస్త్రాలను కమిటీ సభ్యులు అందజేశారు.

టీచర్‌ను ఇక్కడే ఉంచండి

● కన్నీళ్లు పెట్టుకున్న విద్యార్థులు ●దుగ్గసాగరంలో పొలిమేరకు వచ్చి వీడ్కోలు


కన్నీరు పెట్టుకున్న విద్యార్థినులు

సాలూరు రూరల్: పని సర్దుబాటులో భాగంగా పాఠశాల నుంచి డిప్యూటేషన్‌పై గురువారం ఉపాధ్యాయినిని పంపించడంతో విద్యార్థులు కన్నీళ్లు పెట్టుకున్న సంఘటన దుగ్గసాగరం ప్రాథమిక పాఠశాలలో చోటుచేసుకుంది. ఆమెను రిలీవైన అనంతరం గ్రామ పొలిమేర వరకు వచ్చి వీడ్కోలు పలికారు. నిబంధనల మేరకు 20 కంటే తక్కువ ఉన్న పాఠశాలలో ఒక్కరే టీచరు ఉండాల్సి ఉంది. అయితే పాఠశాలలో 19 మంది విద్యార్థులు ఉండడంతో జూనియర్ టీచర్ మజ్జి ఈశ్వరమ్మ (సబేరా బేగం)ను పెదబోరబంద పాఠశాలకు పంపించారు. ఆమె ఇక్కడ ఏడేళ్లుగా పనిచేస్తుండడం, మెలకువలతో బోధనవల్ల విద్యార్థులు, గ్రామస్థుల అభిమానం సంపాదించారు. ఈ నేపథ్యంలో ఆమె మరో పాఠశాలకు వెళ్లిపోతుండడంతో విద్యార్థులు కన్నీరు పెట్టుకున్నారు.

గణేష్ మండపాల అనుమతులకు అవస్థలు


అనుమతులకోసం మీసేవ కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్న దృశ్యం

భామిని: గణేష్ ఉత్సవాల ఏర్పాట్లకు పోలీసుల అనుమతి కోసం ఇక్కట్లు తప్పడం లేదు. సచివాలయాలకు వెళ్లి అనుమతి తీసుకోవాలని పేర్కొన్నా ఆన్‌లైన్‌లో చలానా కట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. మీసేవ కేంద్రం చుట్టూ తిరుగుతున్నామని యాతంగూడ గిరిజనులు వాపోతున్నారు. ఆన్‌లైన్‌లో నమోదుకు రూ.3,500 చలానా చెల్లించాల్సి వస్తుందని పేర్కొనడంతో బత్తిలి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అనుమతులు ఇవ్వాలని కోరారు. అక్కడ కుదరని, ఆన్‌లైన్‌లో అనుమతి పొందాలని పేర్కొన్నారు. గతంలో వినతిపత్రం అందించి అనుమతి తీసుకొనే వారమని, తాజాగా ఆన్‌లైన్ అనుమతుల వల్ల ఇబ్బందిపడుతున్నామని యువకులు చెబుతున్నారు. కాగా తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి చలానా చెల్లించి మండపాల కమిటీ సభ్యులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి అనుమతి తీసుకోవాలని ఎస్ఐ అనీల్‌కుమార్ తెలిపారు.

మండపాల నిర్వహణ కమిటీలదే: సీఐ

పార్వతీపురంటౌన్: వినాయక నవరాత్రి ఉత్సవాలు తొమ్మిదిరోజులే నిర్వహించాలని పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.నారాయణ తెలిపారు. గురువారం పార్వతీపురంలో విలేకరులతో మాట్లాడుతూ వినాయకచవితి మండపాల నిర్వహణ బాధ్యతలు ఉత్సవ కమిటీలదేనని తెలిపారు. ఉదయం ఆరునుంచి రాత్రి పదిగంటలలోపే పూజాకార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. నిమజ్జన సమయంలో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కారాదని, రాత్రి పది గంటల తర్వాత అశ్లీల కార్యక్రమాలకు తావులేదన్నారు. నలుగురికి తక్కువ కాకుండా మండపం వద్ద కాపలా ఉండాలని తెలిపారు. మండపాల నీళ్లడ్రమ్ములు సిద్ధంగాఉంచాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎం.గోవింద పాల్గొన్నారు.

నేడు టీడీపీ కార్యకర్తల సమావేశం

గరుగుబిల్లి: ఉల్లిభద్ర ప్రాంతంలో పార్టీ మండల స్థాయి కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు టీడీపీ మండలాధ్యక్షుడు అక్కేన మధుసూదనరావు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి పార్టీ ప్రతినిధులతోపాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతంపేట: మండలంలోని 33 కేవీ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనుల కోసం శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

● **పాలకొండ:** మండలంలోని నవగాం ఉప కేంద్రంపరిధిలో మరమ్మతులు, ఎం.సింగుపురంలో కొత్త ఏబీ స్విచ్ ఏర్పాటు నిమిత్తం దృష్ట్యా శుక్రవారం 11 కేవీ రూరల్ ఫీడర్ పరిధిలో విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ టీజీకే మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పదినుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు అంతరాయం కలగనుండడంతో వినియోగదారులు సహకరించాలని కోరారు.

●**జియ్యమ్మవలస:** మరడాంలో 400 కేవీసబ్ స్టేషన్‌లో నిర్వహణపనుల వల్ల శుక్రవారంఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ బడే శ్రీనివాసరావు తెలిపారు. జియ్యమ్మవలస, కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో సరఫరానిలిపి వేయనుండడంతో వినియోగదారులు సహకరించాలని కోరారు.

9న పార్వతీపురంలో జాబ్ మేళా

గరుగుబిల్లి: పార్వతీపురం ఐటీడీఏ గిరిమిత్ర భవన్‌లో అమెజాన్‌స్కిల్ డెవలప్‌మెంట్ యాజమాన్యం ఆధ్వర్యంలో ఈనెల తొమ్మిదో తేదీన జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ పి.సత్యలక్ష్మికుమార్, ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు. గురువారం గరుగుబిల్లిలో ఏర్పాటుచేసిన కార్య క్రమంలో మాట్లాడుతూ సుమారు 200వరకు ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. పదోతరగతి, అంతకు మించి ఉన్న విద్యార్హతలు గలవారు, 30 ఏళ్లలోపు ఉన్న మహిళలు, పురుషులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

పెదబుడ్డిడిలో నేత్రదానం

జియ్యమ్మవలస మండలంలోని పెదబుడ్డిడికి చెందిన కల్లివిల్లి కూర్మయ్య (96) మృతిచెందడంతో గురువారం కుటుంబసభ్యులు నేత్రదానం చేశారు. నేత్రదానానికి సంబంధించి ఆయన 2016లోనే అంగీకారం తెలుపుతూ కుటుంబసభ్యులను ఉద్దేశించి లేఖ రాశారు. తండ్రి కోరిక మేరకు కుమార్తెలు ఉమామహేశ్వరి, రమణమ్మ, ఈశ్వరమ్మ, పార్వతమ్మ కుటుంబ సభ్యులు శ్రీకాకుళం రెడ్‌క్రాస్ సొసైటీకి సమాచారం అందించారు. సంస్థ శ్రీకాకుళం జిల్లా ఛైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు, ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో జైభారత్ సంస్థ సమన్వయంతో పెదబుడ్డిడి చేరుకున్నారు. రెడ్‌క్రాస్ సిబ్బంది పి.సుజాత, కూర్మయ్య, ఎన్.ఉమాశంకరరావు కార్నియా సేకరించి తీసుకెళ్లారు.

వరద బాధితులకు విరాళం

పాలకొండ: విజయవాడ వరద బాధితుల కోసం ఆర్టీసీ ఈయూ నాయకులు ఒక రోజు వేతనాన్ని విరాళంగా గురువారం ప్రకటించారు. విజయనగరం జోన్ ఇన్‌చార్జి పి.భానుమూర్తి, జోనల్ అధ్యక్షుడు కె.సుబాకర్, జోనల్ సెక్రటరీ కృష్ణమూర్తి, జోనల్ ట్రెజరర్ తాతాలు విలేకరులతో మాట్లాడుతూబాధితులకు ఒక రోజు వేతనాన్ని అందించడం ఆనందంగా ఉందన్నారు.